# "తెరపి మరపులలో"

సి. ఆనందా రామం



యుగయుగాలుగా మానవాళికి గిలిగింతలు పెడుతూ ఈనాటికీ మైమరిపిస్తుంది ప్రణయం.

అనాదిగా అనుభూతవుతోన్నా ఏనాటికానాడు గుండియ వ్రీలజేస్తుంది మరణం.

జీవన్మరణ సంధ్యలలో ఊగులాడే వ్యక్తులను పేరాశలతో దోబూచులాడిస్తూ బ్రతుకుతున్నాను—వారంతా తమ అంతరాంతరాల్లో అతి గాఢంగా వాంఛిస్తున్నదానినే నేను మాటలలో పెడుతున్నాను. ఉప్పొంగి పోతున్నారు వాళ్ళు అందుకే!

"నర్సమ్మ మంచిది" అంటున్నారు—

నవ్వుకుంటున్నాను!

"మంచి" అంటే!

తమ మనసుకు నచ్చింది!

తమకు ఆనందం కలిగించేది!

అంతేనా?

ఈ శబ్దాలకు నిర్వచనాలెక్కడ?

"డాక్టర్! మత్తుమందు! బాధ భరించలేను! మత్తు! నిద్రమత్తు......

గత పది రోజులుగా పరిచయమైన స్వరం

భరింపరాని దైన్యం నింపుకున్న స్వరం.

మైకాన్ని... శాశ్వత విస్మృతిని... ఏరి కోరి ఆహ్వానిస్తున్న విలక్షణమైన స్వరం...

మొదటిసారిగా నా బంగరు రంగుల తియ్య తియ్యని మాటలు ఇక్కడే వ్యర్థమయ్యాయి—

"నర్సమ్మ మంచిది" అనే అభినందన అంద లేదు—

నిస్సారమై పేలవమైన తిరస్కారపు నవ్వు వెక్కిరించింది.

"తగ్గిపోతుంది! భయపడకండి!"

అలవాటయిపోయిన పడికట్టు రాళ్ళలాంటి ఓదార్పుమాటలు!

"భయమా? ! ఎవరు భయపడుతున్నారు?"

ఉలిక్కిపడ్డాను—

ఆగి చూశాను—

జీవకళ నశించిన కళ్ళు—

రక్త మాంసాలు హరించిన వొళ్ళు—

బాధను బిగబట్టే పెదవులను చీల్చుకు వి వస్తోన్న మొండి నవ్వు—

"మీరు "తగ్గిపోతుంది" అంటే నా బాధ తగ్గదు—

నాకు మత్తుమందు ఇవ్వండి. బాధ తగ్గినా తగ్గకపోయినా మరిచిపోతాను కనీసం..."

ఈ దశలో వున్న రోగికి నిద్రమందియ్యటం మంచిదికాదు—

ఆ మాటే డాక్టర్‌తో అన్నాను.

"లాభం లేదు సిస్టర్! ఇవాళ కాకపోతే రేపు ! మన చెయ్యి దాటిపోయిన పరిస్థితి! మన కెవరికీ అర్థంకాని ఏ ముహూర్తం కోసమో ఎదురు చూస్తున్న పరిస్థితి. నిద్ర మందు ఇచ్చెయ్యి..."

విరక్తి చెందిన డాక్టర్ జవాబు.

వృత్తి ధర్మంగా అడిగాను. "మీ వాళ్ళెవరు? ఎక్కడున్నారు? చెపితే మీ గురించి తెలియ పరుస్తాం!"

"ఎవ్వరూ లేరు సిస్టర్ ! అదృష్టవంతుణ్ని, నేను చచ్చిపోతే నా వాళ్ళు ఏమైపోతారో అనుకోవలసిన అవస్థ లేదు నాకు!"

మాటలలో దొర్లిన అదృష్టం కంఠంలో ధ్వనించలేదు. ముఖంలో ప్రతిఫలించలేదు.

రోగి దీనంగా ఆక్రోశిస్తున్నాడు.

డాక్టర్ అనుమతి ఇచ్చేశారు.

ఇయ్యకూడదని తెలిసి తెలిసి నిద్రమందు ఇచ్చాను. ఆ మందు ఇదివరకే అలవాటయిన శరీరం కాబోలు ! చిన్న మోతాదులు పని చెయ్యటంలేదు! పెద్ద మోతాదులో ఇవ్వవలసి వస్తోంది.

బాధతో మెలికలు తిరుగుతోన్న శరీరం తాత్కాలికంగా స్తబ్దమవుతోంది—

దృష్టి ఉన్నా అది ఈ లోకపు దృశ్యాల కతీత మవుతోంది—

ఎక్కడో ఎటో చూస్తున్నాయి ఆ చూపులు— వదిలీ వదులుతోన్న చైతన్యం జీవస్పందనతో ఘర్షణపడుతోంది—

"రమా !"

ఉలికిపడ్డాను !—

నా పేరు ఇక్కడ ఎవరికీ తెలియదు !

కథలలోలాగ నాకితడు పరిచితుడా ?

ఎన్నడూ ఎక్కడా చూసిన గుర్తు రావటం లేదు— "రమా ! పాప ఏడుస్తోంది ! వెళ్ళి చూడు !"

తేలిగ్గా నిట్టూర్చాను. ఇతను నన్ను పిలవ లేదు— తెరచి మరపుల నడుమ ఏవో స్మృతులలో జీవిస్తున్నాడు—

తనకెవరూ లేరన్నాడే ! రమ ఎవరు ? పాప ఎవరు ? బ్రతికి ఉన్నారా ? లేక......

అక్కడే కూర్చున్నాను !

కుతూహలం ! అతి మామూలుగా కనిపించే మానవ హృదయాలలో అంతర్నాటకాలు అర్థం చేసుకోవాలనే ఆకాంక్ష !

"బాబు బడికి వెళ్ళాడా రమా! వెధవ ! రోజూ పుస్తకమో, పెన్సిలో, పారేసుకోకుండా ఉండడు— వాడికి జాగ్రత్త ఎప్పటికొస్తుందో ! ఇంత పెద్దవాళ్ళమయ్యాం ! మనకొచ్చిందా జాగ్రత్త ! నిన్నటికి నిన్న డబ్బులు లేక పోయినా సినిమాకు వెళ్ళి వచ్చాం. డబ్బు దేముందిలే ! ఆ చీకట్లో నీ చెయ్యి నా చేతిలో పెట్టుకుని కూర్చుంటే ఆ చెత్తసినిమా ఎంత బాగుంది! నీ నుండి తేలివచ్చిన శాండల్ వుడ్ ఆయిల్ పరిమళాలు ఇంకా నన్ను ఆవరించుకునే ఉన్నాయి — పరిమళమంటే గుర్తు కొచ్చింది. పాప చూడు! ఇంకా పక్కబట్టలు తడుపుతోంది. రెండో ఏడువచ్చినా ఇంకా నువ్వు ఆ అలవాటు మాన్పించకపోతే ఎలా?

"వెధవ ఉద్యోగాలు! ఈ రోజుల్లో ఆర్థిక పరిస్థితులనుబట్టి ఆడా మొగాకూడా ఉద్యోగం చెయ్యవలసివస్తోంది. ఆడవాళ్ళు సుఖంగా ఇళ్ళలోవుండి ఇంటినీ పిల్లలనూ చూసుకుంటేనే మేలు! అదిగో! అప్పుడే కోపం వస్తోంది. అన్నట్లు ఇది స్త్రీ అభ్యుదయం సాధిస్తోన్న యుగంకదూ! పిచ్చిదానా! చదువుకుని ఉద్యోగం చేసినంత మాత్రాన అభ్యుదయం సాధించి నట్లేనా! అక్కడితో సమస్యలు తీరిపోతాయా? మనకేం కావాలో మనమే సరిగ్గా తెలుసుకోలేని వాళ్ళం .. అభ్యుదయాన్ని ఏవిధంగా సాధిస్తాం? కొన్ని కొన్ని పదాలు వాటి అసలైన అర్థాన్ని పోగొట్టుకొని నిర్జీవంగా తయారయిపోతు న్నాయి — "అభ్యుదయం" కూడా వాటిల్లో ఒకటా?" వాక్కు స్పష్టత కోల్పోతోంది — ఏవేవో ధ్వనులు .. ఎంత ప్రయత్నించినా నేను అందుకోలేని ఏవేవో భావాలు వ్యక్తంచేసే అవ్యక్త ధ్వనులు డాక్టర్‌కు వివరించాను.

"ఇతను ఎవరినో కలవరిస్తున్నాడు — ఏవేవో అంటున్నాడు .. ఎవరైనా ఉన్నారేమో! కనుక్కుని తెలియపరిస్తే..."

నా అమాయకత్వానికి డాక్టర్ నవ్వు...

"ఈ దశలో రోగి ఉన్నవీ లేనివీకూడా కలవరిస్తాడు సిస్టర్! ఆ మాటలు ఆధారంగా మనం ఏమీ ఊహించలేము. సరే! ఈ సారి తెరపి లోకిరాగానే మరోసారి అడిగి చూడు—"

నా ప్రశ్న రోగిని బాధిస్తుందని తెలిసినా అడిగాను మళ్ళీ...

"మీ వాళ్ళెవరైనా ఉంటె చెప్పండి. తెలియ పరుస్తాం! ఇలాంటి సమయంలో ఆత్మీయులు దగ్గరుంటే మంచిది కదూ!"


"లేరు! లేరు! లేరునా కెవ్వరూ లేరు! నన్ను విసిగించకండి— నాకు నిద్రమందు ఇయ్యండి— త్వరగా ఇయ్యండి —ప్లీజ్! సిస్టర్! ప్లీజ్!"

ఒక్క నిట్టూర్పు విడిచాను—

చెయ్యగలిగింది లేక నిద్రమందు ఇచ్చాను— బాహ్యస్మృతి కోల్పోతున్న చైతన్యం ఎక్కడో విహరిస్తోంది.

"రమా ! ఇంక మనం పెళ్ళి చేసుకుందాం! ఇప్పటికే చాలా ఆలస్యమయింది—"

ఫ్రీగా లిఫ్ట్ ఇచ్చినంత మాత్రాన ఎక్కొద్దురా అంటే విన్నాడా!



# తెరపి మరపులలో

నా స్నేహితులా? అవును! ఉన్నారు స్నేహితులు! కానివాళ్ళను పెళ్ళిచేసుకోలేను రమా! నా దృష్టిలో పెళ్ళి కేవలం శారీరకావసరాల కోసంకాదు– అవి ఎలాగైనా తీరుతాయి– విడిచైన జీవితం కోసం– నాలో ఒక భాగంగా జీవితం పంచుకొని మానవతా మాధురిని నాకు రుచి చూపించగల సహచరికోసం...ఎన్నాళ్ళైనా ఆగుతాను అందుకోసం ......" నాలో కుతూహలం ఎక్కువ కాసాగింది.

బాగా దగ్గిరగా వంగి అడిగాను.

"రమ ఎవరు? ఎక్కడుంది?"

"రమ నా భార్య – హైదరాబాద్‌లో ఉంది."

"హైదరాబాద్‌లో ఎక్కడ?"

"ఇల్లు చిక్కడపల్లిలో ఉంది. హైస్కూల్లో టీచరుగా పనిచేస్తుంది."

ఎంత ప్రయత్నించినా ఇంతకంటె గ్రహించలేకపోయాను.

ఆ స్థితిలో ఉన్నవీ లేనివీ మాట్లాడతారని చెప్పారు డాక్టర్.

రమ ఎక్కడుందో చెప్పాడు. ఏ స్కూల్లో పనిచేస్తోందో చెప్పాడు. ఎంతవరకూ నిజమో కనుక్కుంటే!

స్కూల్ చేరుకోవటం పెద్ద కష్టం కాలేదు. కాని అక్కడ రమాదేవి అనే టీచర్ ఎవరూ లేరని చెప్పారు.

నిరాశతో తిరిగిపోబోతున్నాను–

"ఉండండి–మా హెడ్ మిస్ట్రెస్ పేరు రమాదేవి. ఆవిడ మొదట్లో టీచర్‌గా చేరారు. ఇప్పుడు హెడ్ మిస్ట్రెస్ అయ్యారు. కలిసి మాట్లాడి చూడండి"

హెడ్ మిస్ట్రెస్ రూంలోకి వెళ్ళాను.

కుర్చీ నిండుగా ఒక భారీ విగ్రహం కూర్చొని ఉంది.

దళసరి కళ్ళద్దాల మూలంగా కళ్ళల్లో భావాలు సరిగా అర్థం కావటం లేదు.

జుట్టు చాలా భాగం నెరిసింది.

పెత్తనం చెలాయించటం బాగా అలవాటయినందువల్ల నేమో మామూలుగా ఉన్నపుడు కూడా కనుబొమలు ముడుచుకునే ఉన్నట్లున్నాయి.

"మీ పేరు....."

"రమాదేవి."

కంఠం సన్నగానే ఉంది కాని ఏదో కటుత్వం తోస్తోంది.

"మీకు శ్రీనివాస్‌గారు తెలుసా?"

"ఏ శ్రీనివాస్?"

"రేడియోలో న్యూస్ రీడర్‌గా పనిచేసిన శ్రీనివాస్"

"తెలుసు......"

ఆవిడ కంఠం వణికింది – లావుపాటి కళ్ళద్దాలలోంచి కళ్ళలో కరడు కట్టిన ఏదో వ్యథ కరిగి కనిపించింది. ఒక్కసారి కళ్ళజోడుతీసి కళ్ళూ కళ్ళజోడూ రుమాలుతో తుడుచుకుంది—

నా అనుమానం దృఢపడ సాగింది—

ఏదో సాధించానన్న సంతృప్తితో మనసు నిండిపోయింది.

"మీరు మిసెస్ శ్రీనివాస్ అనుకుంటాను..." చూస్తూ ఉండగానే ఆవిడ ముఖ భంగిమ మారిపోయింది.

కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

ఆపాద మస్తకమూ వణుకుతూ లేచి నించుంది.

"గెటవుట్! ప్రతి గాడిదకూ నన్ను అవమానించటమే పనయింది. యూ గెటవుట్!"

పిచ్చిదానిలా అరిచింది.

ప్రతి అక్షరంలో పగ సెగలు కక్కేలా అరిచింది. బిత్తరపోయాను.

ఈవిడ వ్యక్తిగత విషయాలు నాకు తెలియవు. ఏ చీకటి గాథలు ఆ గుండెల్లో దాగి ఉన్నాయో! ఏ బలవత్తర కారణాలవల్ల ఆ దంపతులు విడిపోయారో?

నేను అవమానిస్తున్నాననుకుంటోంది.

"క్షమించండి! మిమ్మల్ని అవమానించాలని రాలేదు. శ్రీనివాస్ మరణావస్థలో ఉన్నారు. అపస్మారక దశలో మీ పేరు కలవరించారు. డాక్టర్" ఆ కలవరింతలు నిజం కాకపోవచ్చు" అన్నారు. కుతూహలం కొద్దీ నిజం తెలుసుకోవాలని వచ్చాను. సెలవు."

వెళ్ళి పోబోయాను.

"ఆగండి."

ప్రశాంతంగా ఉంది స్వరం.

ఆగి ఆవిడ ముఖంలోకి చూశాను.

ఇందాకటి ఇనుపతెర లేదు ఆ ముఖానికి... కొన్ని క్షణాలలోనే ఎంతో వడిలిపోయింది.

కళ్ళు స్రవిస్తున్నాయి.



డిజైన్: శివలెంక రామకృష్ణారావు, వరంగల్లు-2

తుడుచుకోవాలనే ధ్యాసకూడా లేకుండా కూర్చుంది.

"నేనూ వస్తాను మీతో..."

"రండి!"

ఉత్సాహంగా అన్నాను.

ఒక రోగికి అంతిమదశలో అత్యంతాప్తురాలిని దగ్గిర చేర్చగల్గుతున్నాను.

డాక్టర్‌గారి అభిప్రాయం పొరపాటని ఋజువు చెయ్యగలుగుతున్నాను.

"నాతో రండి! మా అమ్మగారికి చెప్పివెళ్దాం. పెద్దది నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది."

కుర్చీలోంచి లేస్తూ అంది రమాదేవి.

రమాదేవి తల్లి వృద్ధురాలు! బ్లడ్‌ప్రెషర్, కంటిజబ్బు, గుండెదడ మొదలైన వృద్ధాప్యపు రోగాలతో బాధపడుతూ మంచంలో పడుకుని మూలుగుతోంది.

"అమ్మా! నేను శ్రీనివాస్ దగ్గిరకెళుతున్నాను నీకేం కావలసినా ఆయా ఉంది."

మంచంలోఉన్న వృద్ధురాలు ఉలికిపడింది.

వడిలిపోయిన ముఖం మరింత పాలిపోయింది.

"ఎక్కడికి?" అంది వణుకుతున్నట్లు.

రమాదేవి ఎండిపోయిన పెదవులు జీవంలేని నవ్వు నవ్వాయి.

"ఎందుకమ్మా అంత గాభరాపడతావు? మొగపిల్లలతో సమానంగా నన్ను చదివించావు. అందుకే మొగపిల్లలు బాధ్యతా రహితంగా వదిలేసినా నిన్నూ, నా చెల్లెళ్ళనూ ఆదుకున్నాను. నా బాధ్యత ఎప్పటికి పూర్తవుతుందమ్మా? ఎప్పటికి నాకు విముక్తి?"

వెక్కి వెక్కి ఏడ్చింది రమాదేవి......

నాకు ఏదో అర్థమయీ కానట్లుగా ఉంది.

అటు ఆ వృద్ధమాతనూ, ఇటు రమాదేవినీ చూస్తోంటే ఎవరిని ఓదార్చాలో అర్థం కాలేదు.

తనను తానే సమ్మాళించుకుంది రమాదేవి.

"వెళ్ళొస్తానమ్మా!" అంది.

"వెళ్తున్నావా?"

దీనాతి దీనంగా ఉంది ఆ స్వరం.

తల్లి దగ్గిరగా నడిచింది రమాదేవి.

నుదుటిమీద చెయ్యి వేసింది.

"దిగులుపడకమ్మా! నీ అదృష్టం కొద్దీ శ్రీనివాస్ దగ్గిర ఎక్కువ కాలం ఉండగలిగే అదృష్టం నాకు లేకపోవచ్చు."

చటుక్కున దిండులో తల దాచుకుంది ఆ వృద్ధురాలు.

ఎగిరెగిరి పడుతోన్న శరీరాన్నిబట్టి ఆవిడ ఏడుస్తోందని అర్థమవుతోంది.

"పదండి–" అంది రమాదేవి.

నా మనసులో ఎన్నెన్నో ప్రశ్నలు.

కానీ రమాదేవి ముఖం చూస్తోంటే ఏదీ అడగలేకపోయాను.

"డాక్టర్ ! మత్తుమందు ! నిద్రమందు ! బాధ భరించలేను డాక్టర్.. ....."

అప్పుడే తెరపిలోకి వచ్చిన శ్రీనివాస్ మరపులోకి జారిపోవటానికి డాక్టర్‌ను ప్రాధేయపడుతున్నాడు.

అడుగుల చప్పుడుకు తలెత్తిన డాక్టర్ రమాదేవిని చూసి ఆశ్చర్యపోయాడు...

"హలో ! కుమారి రమాదేవిగారా ? ఇలా వచ్చారేం ?"

ఆ పేరు వింటూనే దిగ్గున తలెత్తాడు శ్రీనివాస్. ఏదో పూనినట్లు లేచి కూచున్నాడు.

"కుమారి......"

వెనక్కు ...

అవే అతని నోట వెలు... ...గాలు. అతని సమస్త చైతన్యమూ శాశ్వతంగా మూగబోయింది.

ఆ కట్టెపై కూలిపోయింది కుమారి రమాదే...




మాయలూ మంత్రాల భ్రమలు మనకొద్దు. డబ్బు తలనొప్పిని మంత్రదండం తిప్పి చిటికలో మటుమాయం చేయడం ఎవరివల్లా కాదు. కాని తలనొప్పి తగ్గించడానికి మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్ మీకెంతో తోడ్పడుతుంది.

మేం మీతో కూర్చుంటాం. మీసమస్యలను గురించి చర్చిస్తాం. వాటిని పరిష్కరించడానికి మా శాయశక్తులా కృషిచేస్తాం. మీరు....అడపాదడపా పెద్ద మొత్తాలను జరూరుగా సమకూర్చుకోవలసి వచ్చే పెద్ద వ్యాపారస్తులు కావచ్చును.... పిల్లల చదువు సమస్యతో సతమతమయ్యే ఉద్యోగస్తులు కావచ్చును....లేదా ఉద్యోగంచేసే యువతులు కావచ్చును. మీరెవరైనప్పటికి మీకు మేము వేర్వేరు మార్గాలు చూపగలం. మీ పరిస్థితులకు చక్కగా అనువయే మార్గాన్ని ఎన్నుకొనడంలో తోడ్పడగలం.

డబ్బు ఇన్నాళ్ళుగా తలనొప్పిగా వుంటున్నదని మీరనుకుంటూ వుంటే మార్గదర్శి మనిషితో మాట్లాడండి.

.బ్బుకోసమేనా మీ చింత!
.ార్గదర్శి ఉన్నది మీ చెంత!

# మార్గదర్శి

చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్

అబిడ్ సెంటర్, హైదరాబాదు-1 ఫోన్ : 46225
బిసెంట్‌రోడ్డు, విజయవాడ-2 ఫోన్ : 7797
మెయిన్‌రోడ్డు, విశాఖపట్నం-1

Kiron

"టెలిఫోన్ ఎక్ఛేంజి ఎదుట, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్"